స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే...

మరో విద్యుత్ ఉద్యమం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం (డబుల్ ఇంజనీర్ సర్కార్) ప్రజల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడాన్ని ఉపసంహరించు కోకపోతే మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం కర్నూలు విద్యుత్‌సౌధ మందు వందలాది మంది ప్రజలతో సిపిఎం ఆధ్వర్యంలో బైఠాయించారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి నాయకులు చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్ 2024 ఎన్నికల కంటే ముందు బాదుడే బాదుడు అని బ్యానర్ పట్టుకుని స్మార్ట్ మీటర్లు వస్తే తగలబెట్టండి పగలగొట్టండి మీ వెంట మేమున్నామని చెప్పారన్నారు. తాము అధికారంలోకొస్తే ఒక్క పైసా కరెంటు చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు తీసుకునిరాము అని ప్రజలకు హామీ ఇచ్చిన విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ కంటే మేమేఘనులమని చెప్పి ఈ సంవత్సరకాలంలో దాదాపు రూ.20 వేల కోట్ల సర్దుబాటు చార్జీల పేరుతో, సర్ఛ్ చార్జీలు పేరుతో భారం వేశారన్నారు. కొత్తగా స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకురావడానికి సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ప్రజలు కూడా స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2022లో విద్యుత్ సంస్కరణలు తీసుకుని వచ్చిన తర్వాత బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సాహసించని కార్యక్రమాన్ని నాడు జగన్ ప్రభుత్వం చేపట్టడం వల్ల ప్రజలు బుద్ధి చెప్పి ఇంటికి పంపించారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు విద్యుత్ సంస్కరణలు తీసుకు వచ్చిన తర్వాత సంస్కరణలకు వ్యతిరేకంగా నాడు విద్యుత్ ఉద్యమం చేపట్టి ముగ్గురు కార్యకర్తలు బలిదానం చేసిన తర్వాత చంద్రబాబు నాయుడుకి ప్రజలు అధికారానికి చాలా దూరంగా పెట్టిన విషయాన్ని చంద్రబాబు నాయుడు గమనించాలని ఘాటుగా విమర్శించారు. నాడు బుద్ధి చెప్పిన తర్వాత కూడా చంద్రబాబు నాయుడుకి జ్ఞానోదయం కలగలేదన్నారు. కార్పొరేట్ కంపెనీ ఆదానికి ఊడిగం చేయడం కోసం మాత్రమే స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకుని వచ్చారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు అంటేనే ప్రీపెయిడ్ విధానాన్ని తీసుకురావడం అనేది చాలా స్పష్టమని తెలిపారు. ఇప్పటికే కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు పెట్టిన చోట ఇప్పుడున్న బిల్లు కంటే రెట్టింపు వస్తున్నాయని దానివల్ల ప్రజలు వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ స్మార్ట్ మీటర్లకు తయారయ్యే ఖర్చు అంతా ప్రజలే భరించేలా సింగల్ ఫేస్ కైతే రూ.8927, త్రీ ఫేస్కు అయితే రూ.17,286 ప్రజలే 93 నెలల్లో తన బిల్లుల ద్వారా చెల్లించాలని ఈ రకంగా ప్రజలకు తెలియకుండా ప్రజల నెత్తిమీద రూ.పదివేల నుంచి రూ.17 వేల దాకా భారాలు వేస్తున్నారని తెలిపారు. ఈ భారాలు వేయడం కోసమేనా ప్రజలు చంద్రబాబు నాయుడుకు, లోకేష్‌కు, పవన్‌కల్యాణ్‌కు ఓటు వేసి గెలిపించిందని అన్నారు. ప్రీ పెయిడ్ విధానమంటేనే సెల్ఫోన్‌కు ఏ రకంగా రీఛార్జ్ చేసుకుంటామో రాబోయే కాలంలో ప్రజలు విద్యుత్ సంస్థతో సంబంధం లేకుండా తమ సెల్లుకు రీఛార్జ్ చేసుకునే విధానం వల్ల ప్రజలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వందలాదిమంది ఉన్న మీటర్ రీడర్ల ఉపాధి పోతుందని, కొత్త ఉపాధి ఇవ్వకపోయినా ఉన్న ఉపాధిని ఊడగొట్టడం కోసమేనా టిడిపి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిందని అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు మేల్కొని స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మీ ఇంటి దగ్గరికి మీటర్ మార్చడం కోసం వస్తే తిరస్కరించండని, మీరు ఏ పేరు చెప్పినా కొత్త మీటర్లు పెట్టుకోవద్దన్నారు. రాబోయే కాలంలో సిపిఎం ,ఇతర వామపక్ష పార్టీలు ప్రజాసంఘాలతో కలిసి గతంలో చేసిన విద్యుత్ ఉద్యమం లాగా మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడుతుందని ఆ ఉద్యమానికి ప్రజలు బలపరచాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు 2000 సంవత్సరంలో విద్యుత్ పోరాటం ద్వారా బుద్ధి చెప్పినప్పటికీ జ్ఞానోదయం కలగలేదని. మరి అలాంటి తప్పే ఇప్పుడు చేస్తున్నాడని ఆమె విమర్శించారు. స్మార్ట్ మీటర్లు వద్దు ప్రజలకు భారం అవుతాయి అని చెప్పినా ఆయన నేడు ఉలుకు పలుకు లేకుండా మౌనంగా ఉంటూ కంపెనీ వాళ్ళను అధికారులను ఉపయోగించుకుని స్మార్ట్ మీటర్లను దొంగతనంగా పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. దీనివల్ల ప్రజలకు మోయలేని భారం పడుతుందని ఆమె తెలిపారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడారు. విద్యుత్ అధికారులు ప్రజలకు తెలియకుండా మీటర్లు పెట్టబోమని వాళ్ళు అనుమతిస్తేనే మీటర్లు పెడతామని అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాత ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎన్.అలివేలు, వై.నగేష్, సి.గురు శేఖర్, నగర నాయకులు విజయ్, నరసింహులు, సుధాకరప్ప, సాయిబాబా షరీఫ్ అబ్దుల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు విద్యుత్ సౌధ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఈసారీ కందిపప్పు లేదు..!

- ఎనిమిది నెలలుగా అదే తీరు - రేషన్‌లో సరుకుల్లో కొనసాగుతున్న కోత

ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ మొదటి నుంచి సమీక్షల్లోనూ చెబుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది కూటమి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడుతుందంటూ చెప్పుకొచ్చారు. అయితే ఆచరణలో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీపై దృష్టి సారించలేకపోతున్నారు. ఎనిమిది నెలలుగా రేషన్‌లో కందిపప్పు సరఫరా కావట్లేదు. కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. ఏడు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. ఏప్రిల్ నెలలోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పుచారుకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్దిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ ఏడాది జూన్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. ఉగాది, రంజాన్ పండుగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్ధిదారులు ఆశించినా నిరాశే ఎదురైంది.

బహిరంగ మార్కెట్లో కొనలేక

ప్రజలు నిత్యం వాడే కందిపప్పు నాణ్యతను బట్టి ధర రూ.110 నుంచి 150 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా కూటమి సర్కారు సైతం పట్టించుకోవడం లేదు. కందిపప్పు ధర భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దానికి తోడు పేదలపై భారాలు రోజురోజుకి ఎక్కువ అవుతున్నాయి. దీంతో కందిపప్పు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాణ్యత తక్కువగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా, ఇది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు.

ఎదల బతుకులు మారడం లేదు

-లక్ష్మి, కుమ్మరి వీధి కర్నూలు

పాలకులు మారినా పేదల బతుకులు మారడం లేదు. గతంలో టిడిపి ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు బియ్యం, కందిపప్పు, ఉప్పు, కారం, చక్కెర, జొన్నలు, గోధుమలు, చింతపండు లాంటి నిత్యవసర సరుకులు రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. ప్రభుత్వాలు మారే కొద్దీ పేదలకు ఇచ్చే నిత్యవసర సరుకులు ఒక్కొక్కటి తగ్గిస్తూ వచ్చారు. ప్రస్తుతం బియ్యము, చక్కెర తప్ప ఏ సరుకులూ ఇవ్వడం లేదు. కందిపప్పు కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదు. బయటకుందామంటే సామాన్య ప్రజలకు నిత్యవసర ధరలు చుక్కలను అంటుతున్నాయి. టమాటా చారు చేసుకుని చట్నీ నూరు కొని అన్నంలో కలుపుకుని తినాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజలకు నిత్యవసర సరుకులిచ్చి ఆదుకోవాలి.

సరుకులు ఇచ్చి ఆదుకోవాలి

- పద్మ, పెద్ద మార్కెట్, కర్నూలు.

మూడు నెలలుగా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కంది బేడలు ఇవ్వడం లేదు. దీంతో పప్పు వండుకునే పరిస్థితి లేకుండా పోయింది. భార్యాభర్తలం పగలంతా కష్టపడితే వచ్చే డబ్బులతో కుటుంబం మొత్తం కడుపునిండా మూడు పూటలా తిండి కరువైంది. పిల్లలకు మూడు పూటలా పెట్టి పెద్దలు ఒక పూట తిని పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం పేదల కోసం నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలి లేదా రేషన్ షాపుల ద్వారా ఇచ్చే సరుకులైనా తక్కువ ధరలకు అందించి ఆదుకోవాలి.

అర్జీలను పెండింగ్‌లో ఉండరాదు

-కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేషన్

బాధితులు ఇచ్చిన అర్జీలను పెండింగులో లేకుండా వెంటనే పరిష్కరించేలా చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరించి, ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని కలెక్టర్ ఆదేశించారు. అర్జీలు రీ ఓపెన్ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యులను కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన షేక్ బాబా ఫక్రుద్దీన్, షేక్ దాదా పీరా, కడప జిల్లా కు చెందిన చౌడ గండ్ల, నంద్యాల జిల్లాకు చెందిన సుభాన్, షాపీర ఐదుగురు ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్నట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించామని, వారిని అరెస్టు చేశామని కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ తెలిపారు. వారు కర్నూలు, అనంతపురం, గుంతకల్లు, అన్నమయ్య, హైదరాబాద్‌లలో దొంగతనాలకు పాల్పడ్డారని డిఎస్‌పి తెలిపారు. వారి నుంచి 24 వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నా రు. ఈ ఐదు మంది ముఠా సభ్యుల్లో ముగ్గురిని అరెస్టు చేశామని, పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. దొంగలించిన వాహనాలకు నకిలీ ఆర్‌సిలు తయారు చేసి విక్రయించేవారిని తెలిసిందన్నారు. ఈవిషయంపై దర్యాప్తు చేస్తామని డిఎస్‌పి తెలిపారు. ఈకేసుల దర్యాప్తులో విధులు నిర్వహించి పోలీసులను డిఎస్‌పి అభినందించి వారికి నగదు ప్రోత్సాహకం అందించారు. కర్నూలు త్రీ టౌన్ సిఐ శేషయ్య, ఎస్ఐ మల్లికార్జున, చంద్ర ఉన్నారు.

మాట్లాడుతున్న డీఎస్పీ బాబు ప్రసాద్

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ, ఇతర అధికారులు

అర్జీలను సత్వరమే పరిష్కారించాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 22 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్: పజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కారించాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ 22 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఎంఇలు శేషసాయి, లీల ప్రసాద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య, అధికారి నాగరాజు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రితో లైవ్ ఉపాధి గ్రామ సభ

ప్రజాశక్తి-సి బెళగల్ :మండలంలోని గొల్లలదొడ్డిలో సోమవారం లైవ్‌లో ఉప ముఖ్యమంత్రి గ్రామ సభ నిర్వహించారు. ఇందులో 2024-25కు సంబంధించిన ఉపాధి నిమిత్తం 38 పనులను గుర్తించి అందుకు రూ.32 లక్షల 86602 లను ఖర్చు చేసిందని,అవకతవకలు జరిగినట్లు ఎస్ఆర్‌పి వెంకటేశ్వర్లు పేర్కొ న్నారు. అధిక కొలతలు, మస్టర్లలో తప్పులు, సంతకాలు లేకుండా వేతనాల మంజూరు వంటివి భారీగా జరిగినట్లు డిఆర్‌పి లక్ష్మన్న తెలిపారు.

పూర్వ విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరాశాంతి , రిటైర్డ్ అధ్యాపకులు,తదితరులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ వర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు.1997-2000 సంవత్సరము బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం అయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న వర్సిటీ రిజిస్ట్రార్ కట్టవెంకటేశ్వర్లు కళాశాల ప్రిన్సిపల్ ఇందిరాశాంతిలు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకులు, ప్రిన్సిపల్ టి.సిద్ధారెడ్డి , డాక్టర్ జాబ్‌పాల్ , విద్యాసాగర్ వెంకటేశ్వర్ రెడ్డి , రామకృష్ణారెడ్డి, బాల సంజయ్ ,విజయ బృందాల సమన్వయకర్తలు నాయకంటి మద్దయ్య రాజేష్ విజయ్ చంద్రశేఖర్ సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసగించారు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేశారని పలువురు బాధితులు జిల్లా ఎస్‌పిని కలిసి వేడుకున్నారు. సోమవారం కర్నూలు, కొత్తపేటలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో ఎస్‌పి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 102 ఫిర్యాదులు వచ్చాయి. వెల్దుర్తికి చెందిన ప్రశాంత్ బాబు ప్రభుత్వ పథకమైన విద్యాంజలి 2.0 పథకం క్రింద కర్నూలు, నంద్యాల జిల్లాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ఫ్యాకల్టీ , అటెండర్, వంటమనిషి, వాచ్‌మెన్, స్వీపర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుండి రూ. 1 లక్షకు పైగా 20 మంది నుండి డబ్బులు తీసుకొని కాస్ ఫౌండేషన్ పేరుతో అపాయింట్ మెంట్ లెటర్స్ ఇచ్చి సంవత్సరం వరకు పని చేయించుకుని జీతం డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన నాగమణి, నారాయణ, అక్బర్, రాజేష్, సుజాత , వెంటేష్, మద్దిలేటి లు పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. కర్నూలు , వెంకటరమణ కాలనీకి చెందిన రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకొని మోసం చేశాడని కర్నూలు ఇందిరాగాంధీనగర్ చెందిన మహేష్ బాబు ఫిర్యాదు చేశారు. చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని అన్నారు. ఉద్యోగాల పేరుతో మధ్యవర్తులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఎస్‌పి సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

పత్తికొండలో సదరం క్యాంపు ఏర్పాటు చేయాలి

-వికలాంగులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను మంజూరు చేయాలి..

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ లో దివ్యాంగుల కోసం సదరం క్యాంపును ఏర్పాటు చేయాలని సిద్ధార్థ దివ్యాంగుల మండల అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండ ఆర్‌డిఓ కార్యాలయంలో సిద్ధార్థ వికలాంగుల బృందం పత్తికొండ ఆర్‌డిఓ భరత్ నాయక్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సిద్ధార్థ వికలాంగుల మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సుమారు 3,334 వికలాంగులు కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వారి కుటుంబాలకు అంత్యోదయ ఆహార భద్రత కార్డు తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఏవైనా సమస్యలు వస్తే ఆదోని ,కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. గతంలో పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలోని సదరం క్యాంపు ఏర్పాటు చేశారన్నారు. గత ఆరు నెలలు సదరం క్యాంపులు నిర్వహించడం లేదని అన్నారు. జిల్లా వైద్య అధికారులు స్పందించి తక్షణమే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలు కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ వికలాంగుల సమాఖ్య సభ్యులు కె. బీరప్ప, పాండురంగడు, కృష్ణయ్య పాల్గొన్నారు.


పత్తికొండ ఆర్‌డిఓకు వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల సంఘం నాయకులు

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సి బెళగల్

అవ్వా, తాత, అక్కా, చెల్లి పింఛన్ వస్తుందా... చదువుల బాలలకు తల్లికి వందనం అందిందా..ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా నేనున్నానంటూ కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి అభయమిచ్చారు. సోమవారం చింతామనుపల్లి, తిమ్మందొడ్డి గ్రామాల్లో సుపరి పాలనపై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పింఛన్ కోసం, హౌసింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపి వచ్చే నెలలో ప్రభుత్వం సంక్షేమ పథకాల వరాలు కురిపిస్తుందని అన్నారు. ప్రజలకు మేలైన పథకాలు,సంక్షేమం కోరేది టిడిపి ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ చిన్న తిమ్మప్ప, వేణుగోపాల్‌రావు, పద్మనాభరావు, సూరి, దస్తగిరి, ప్రతాప్ రెడ్డి,అమర్నాథ్, హనుమంత యాదవ్, నాగేష్, పేమర రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపి బస్తిపాటి నాగరాజు, కృష్ణ యాదవ్, వైద్యులు

పంచాలిగాలలో టిబి ముక్త్ భారత్ అభియాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఇ.తాండ్రపాడు పిహెచ్‌సి పరిధిలోని పంచలింగాల గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కర్నూలు పార్లమెంట్ మెంబర్ బస్తిపాటి నాగరాజు, అడిషనల్ డిఎంహెచ్ఓ జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్, టిడిపి సీనియర్ నాయకులు జి.కృష్ణ యాదవ్ హాజరయ్యారు. అనంతరం అడిషనల్ డిఎంహెచ్ఓ డా. భాస్కర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గిపోవడం, 60 ఏళ్ళు పైబడిన వారు, పొగతాగువారు, మద్యం సేవించు వారు, పౌష్టికాహార లోపం ఉన్న వారికి అందరికి టిబి గళ్ళ పరీక్షలు, ఎక్షరేలు చేయించాలన్నారు. ఇందులో భాగంగా నిక్షయ్ శిబిరాలు ఏర్పాటు చేసి జనభగీదారిలో భాగంగా గ్రామంలోని ప్రజలకు టిబి గురించి తెలియచేయాలన్నారు. టీబీ వ్యాధి గురించి ఉన్న మానసిక రుగ్మతను తీసివేయాలని, వీటితో పాటు ఎవరైనా నిరుపేద టిబి రోగులకు గ్రామ స్థాయిలో దాతల సహకారంతో ప్రతి నెల పౌష్టికాహారం అందచేయాలన్నారు. ఈ తాండ్రపాడు పిహెచ్‌సి డాక్టర్ మంజూష టిబి వ్యాధి గల వారికి పౌష్టికాహారం అందజేశారు. గ్రామం లోని టిబి వ్యాధిని జయించిన వారితో వారి అనుభవలను ప్రజలతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున, వైద్యాధికారి డాక్టర్ మంజుష, మనోజ్, డిస్ట్రిక్ట్ టిబి స్టాఫ్ ఉమాపతి, హెల్త్ ఎక్సటెంక్షన్ ఆఫీసర్ మక్బుల్ సాహెబ్, పి హెచ్ ఎన్ నిర్మల దేవి, హెల్త్ సుపర్వైసర్ ధనమ్మ, టిబి సూపర్వైసర్ నిషిత్, ల్యాబ్ సూపర్వైసర్ ఇమ్రాన్, పంచలింగాల సిహెచ్ఒలు భవ్య, ప్రసాద్, ఆరోగ్య కార్యకర్త ఆరోగ్య షీలా,శివమ్మ.ఇతర ఆరోగ్య సిబ్బంది,ఆశలు పాల్గొన్నారు

బుక్ కీపర్‌లు డబ్బులు వసూలు చేస్తే చర్యలు : ఎపిఎం

ప్రజాశక్తి-మద్దికేర

పొదుపు గ్రూపుల సభ్యుల నుంచి బుక్ కీపర్లు డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎపిఎం రామాంజనేయులు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాలలో పొదుపు సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పొదుపు గ్రూపు సభ్యులు రుణాలు పొందేటప్పుడు బుక్ కీపర్లకు ఎలాంటి లంచాలు ఇవ్వకూడదన్నారు. నిబంధనల మేరకు నడుచుకోవాలని, అతిక్రమిస్తే, చర్యలు తప్పవన్నారు.



యూరియా కోసం రైతుల అవస్థలు

- ప్రతి రైతుకూ యూరియా అందిస్తాం - ఎఒ సరిత

ప్రజాశక్తి - నందవరం

అధికారులతో మాట్లాడుతున్న రైతులు

మండలంలో యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. తమకు యూరియా ఇవ్వడం లేదంటూ రైతులు ఎఒ సరిత వద్ద సోమవారం వాపోయారు. రైతులకు యూరియా అందిస్తామని కొంతమంది వ్యక్తులు శనివారం ప్రకటించారు. రైతులు సొసైటీ దగ్గరకు ఉదయం చేరుకొని పడికాపులు కాశారు. యూరియా కూడా వచ్చింది. అధికారులు మాత్రం 'యూరియా ఈరోజు ఇవ్వం. రేపు రండి అంటున్నారని రైతులు ఎఒకు వివరించారు. రేపు తాము వచ్చే సమయానికి యూరియా లభించదని, నాయకులు వారికి సంబంధించిన రైతులకు మాత్రమే యూరియా పంపిణీ చేస్తారని మండిపడ్డారు. సాధారణ రైతుకు యూరియా లభించే పరిస్థితులు లేవని రైతులు వాపోయారు. కొన్ని గ్రామాల్లో కొంతమంది నాయకులు రైతు సేవా కేంద్రాల దగ్గర ఉదయం నుంచి స్టాక్ అయిపోయేం వరకు ఉండి వారి కార్యకర్తలకు, అనుకూల రైతులకు అందించారని చెప్పారు. నాయకులకు అధికారులు సహకరించడం.. వారు చెప్పిన వ్యక్తులకే ఇవ్వడం బాధాకరమని తెలిపారు. అధికారుల పనులను నాయకులు చేయటం ఏమిటని వారు ప్రశ్నించారు. అధికారులు ప్రేక్షకు పాత్ర వహించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

ప్రతి రైతుకూ యూరియా అందిస్తాం : ఎఒ సరిత

ప్రతి రైతుకూ యూరియా అందించి న్యాయం చేస్తానని ఎఒ సరిత రైతులకు హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. అక్కడకు వచ్చిన రైతుల పేర్లు ఆమె రాసుకున్నారు. మంగళవారం ఉదయం సొసైటీ దగ్గరకు రావాలని సూచించారు. రైతులకు యూరియా ఇచ్చిన తర్వాతనే మిగిలిన రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. మండలంలోని ప్రతి రైతుకూ యూరియా సమానంగా అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఎంపిడిఒ, తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్వచ్ఛభారత్ కింద పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పారిశుధ్య కార్మికులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2024లో 5 నెలలు, 2025వ సంవత్సరంలో 5 నెలలు మొత్తం 10 నెలల దాకా పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు పని ముట్లు ఇవ్వాలన్నారు. వేతనాలు చెల్లించకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారులు మాట్లాడుతూ... ఈ విన్నపాలను వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సిఐటియు నాయకులు వీరన్న, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం పరిధిలోని గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం డిపిఎంఒ డాక్టర్ ఉమా, డిపిఒ విజయరాజు సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని వారు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీసి, రికార్డులను పరిశీలించారు. మండలంలోని నేలతలమర్రి సచివాలయానికి సంబంధించిన రికార్డులను ఆడిట్ చేశారు. అందులో గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, చిన్న పిల్లలు, స్కూల్ విద్యార్థులకు అందుతున్న సేవల గురించి అడిగి, రికార్డులను ఆడిట్ చేశారు. డాక్టర్ ఉమా మాట్లాడుతూ... మాతా, శిశు మరణాలు తగ్గించాలంటే గ్రామ స్థాయిలో గర్భిణులకు రక్త హీనత, బిపి, షుగర్ లాంటి హై రిస్క్ లక్షణాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలింతలకు, పుట్టిన బిడ్డలకు సరయిన సమయంలో తగిన పరీక్షలు, సేవలు అందజేయాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు విజయభాస్కర్, అరుణజ్యోతి, సిహెచ్ఒ భాగ్యలక్ష్మి, ఆరోగ్య విస్తరణాధికారి రంగస్వామి, సూపర్‌వైజర్లు శ్రీధర్, మద్దిలేటి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

స్మార్ట్ మీటర్లపై సిపిఎం పోరు

- విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట ధర్నా
- 'స్మార్ట్' నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- సిపిఎం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - విలేకరులు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో పోరుబాట పట్టారు. విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట ధర్నాలు చేపట్టారు. అధికారులకు వినతపత్రాలు అందజేశారు. స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

ఆదోని విద్యుత్ డిఇ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు

ఆదోని పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం ఆదోనిలో తిమ్మారెడ్డి బస్టాండ్ నుంచి ప్రదర్శన చేపట్టారు. ఆదోని విద్యుత్ డిఇ కార్యాలయం ముందు పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు గోపాల్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ, మండల, కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న మాట్లాడారు. విద్యుత్ మీటర్లు తొలగించి అదాని కంపెనీ స్మార్ట్ మీటర్ నివాసాలకు బిగించడానికి వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ మీటర్ వల్ల శాశ్వతంగా భారాలు పడతాయని చెప్పారు. క్రమంగా విద్యుత్ పంపిణీ కూడా అదాని లాంటి బడా కంపెనీల చేతిలోకి వెళ్లిపోతుందని తెలిపారు. స్మార్ట్ మీటర్ వల్ల నష్టాలు, ప్రమాదాలు గుర్తించి ప్రజలు ఆదిలోనే అడ్డుకోవాలని కోరారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శి వర్గసభ్యులు తిప్పన్న, ముక్కన్న, వీరారెడ్డి, రామాంజనేయులు, నాయకులు వీరేష్, శ్రీనివాసులు, నాగరాజు, మల్లయ్య, చిరంజీవి, హనుమంత రెడ్డి, వెంకటేష్, అజీమ్ ఖాన్, కృష్ణమూర్తి, నాగేంద్ర, తిక్కప్ప, గర్జప్ప, గోవిందు, అయ్యప్ప ఉన్నారు. **మంత్రాలయం** విద్యుత్ శాఖ ఎఇ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.అంజిబాబు, మండల కార్యదర్శి హెచ్.జయరాజు మాట్లాడుతూ... స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రజలపై విద్యుత్ చార్జీల భారాలు పడతాయని తెలిపారు. భవిష్యత్తులో సెల్ ఫోన్‌కు, టివిలకు రీచార్జీ చేసుకునే విధానంతో విద్యుత్‌కు కూడా రీచార్జీ చేసుకోవాల్సి వస్తుందని చెప్పారు. డిమాండ్‌ను బట్టి విద్యుత్ చార్జీలు వసూలు చేస్తారని తెలిపారు. వేసవిలో ఒక రకంగా, చలికాలంలో ఒక రకంగాను విద్యుత్ చార్జీలు వసూలు చేసే విధానం వస్తుందని చెప్పారు. రాత్రి ఒక రకమైన చార్జీలు, పగలు ఒక రకమైన చార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. అదానిలాంటి బడా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చడం కోసమే స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. ప్రజలకు నష్టదాయకమైన స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని, లేకపోతే 2000వ సంవత్సరంలో ఏ రకంగా విద్యుత్ ఉద్యమం జరిగిందో అలాంటి ఉద్యమాన్ని వామపక్షాలు నిర్వహిస్తాయని హెచ్చరించారు. సిపిఎం మండల నాయకులు ప్రాణేష్, ఆంధ్రయ, లక్ష్మన్న, సురేష్, ప్రసంగి, దేవా, వీరేష్, దేవరాజు, జగదీష్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి విద్యుత్ ఎఇ సుధాకర్ రావుకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం శాఖ కార్యదర్శి బి.కరుణాకర్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, మండల నాయకులు ఎన్.నబి రసూల్, రసూల్, రామకృష్ణ, రంగస్వామి, మల్లికార్జున, సుభాన్, వలీ పాల్గొన్నారు. **ఆస్పరి**లో సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ ఆధ్వర్యంలో పోరుబాట పట్టారు. సిపిఎం కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు రంగస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ సామాన్యులపై విద్యుత్ చార్జీల భారం మోపుతున్నాయని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్లు బిగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ ఎఇ ఆంజనేయ శాస్త్రికి వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు రవి, పెద్ద వీరభద్ర, శేఖర్, నాయకులు రామన్న, సల్మాన్, సుందర రాజు, పురుషోత్తం, రమేష్, చిన్న మల్లేష్, పెద్ద దస్తగిరి, రాజేష్, నరసింహులు, కాశన్న, వీరేష్ పాల్గొన్నారు. **కోసిగి** విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం లైన్ ఇన్‌స్పెక్టర్ శివానందకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, మండల నాయకులు రాముడు, వీరేష్, నాగేంద్ర, గోపాల్, చిన్నన్న, పూజారి శ్రీనివాసులు, వెంకటేష్, జేజప్ప, ప్రజాసంఘాల నాయకులు ఫిలిప్, హనుమేష్, హనుమంతు, కోసిగయ్య పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, రైతు సంఘం నాయకులు అబ్బాస్, చేనేత సంఘం నాయకులు కాలప్ప, డివైఎఫ్ఐ నాయకులు సురేష్, సిఐటియు నాయకులు రాముడు, సిపిఎం కార్యకర్తలు రమేష్, లక్ష్మీ నరసయ్య, కృష్ణ, రాజా రమేష్, ఆంథోని, వలీ, పరమేష్, తిమ్మప్ప, నాగుల రాముడు పాల్గొన్నారు. **ఆలూరు** గెస్ట్ హౌస్ నుంచి విద్యుత్ వినియోగదారులతో ర్యాలీగా వెళ్లి విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ నాయకులు మైనా అధ్యక్షత వహించారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, సీనియర్ నాయకులు కెజి.నారాయణస్వామి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ ఎఇ గుర్తప్పకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకులు విజల్, గోవర్ధన్ షేకువలీ, రాధమ్మ, గోసియా, నాగరాజు, శేఖర్, పరమేష్ గౌడ్, విప్పగిరి ఈరన్న, గోపాల్, జోగి దుర్గప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు మణి, ఎర్రిస్వామి, చంద్ర, షబ్బీర్ పాల్గొన్నారు. **కౌతాళం** విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న, రామలింగ, చిన్న మారయ్య, వీరేష్, హనుమంతు, శంకర్, బసవరాజు పాల్గొన్నారు. **దేవనకొండ** విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. సిపిఎం నాయకులు పెద్ద రాయుడు అధ్యక్షత వహించారు. అనంతరం మండల విద్యుత్ అధికారి రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు ముక్కెర అశోక్, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మహేంద్ర, మహేష్, బజారముడు, రాము, రంగడు పాల్గొన్నారు. **హొళగుంద** విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, ఆపరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు, దళిత సబ్బర్క్ష మండల అధ్యక్షులు మల్లేష్, రైతుసంఘం అధ్యక్షులు రవి, నాయకులు, హమాలీలు నాగరాజు, గంగన్న, ముక్కయ్య, వన్నూరు స్వామి, నగేష్, రంగన్న పాల్గొన్నారు. **హాలహర్వి** ఎఇ కార్యాలయంలో సిపిఎం నాయకులు కృష్ణ సబ్ స్టేషన్ ఆపరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోనెగండ్లలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆస్పరిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోసిగిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరులో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ఆలూరులో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కౌతాళంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హామీలు నెరవేర్చిన బాబు

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుపరిపాలన అందిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. సోమవారం పట్టణంలోని నారాయణ గుంత వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఉమ్మీ సలీమ్, ఆరేకల్ రామకృష్ణ, సాధికా బేగం, తిమ్మప్ప, వార్డు ఇన్‌ఛార్జీ మల్లికార్జున ఉన్నారు. **హొళగుంద**లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచారు. కూటమి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సంబంధిత యాప్‌లో నమోదు చేశారు. టిడిపి మండల కన్వీనర్ తిప్పయ్య, డిఎస్.బాషా, ద్వారకానాథ్, ఆదాం, ఎర్రిస్వామి దిడ్డి తిక్కస్వామి, హుస్సేన్ పీరా, జామాపుర మంజునాథ, ఖేదార్‌నాథ్, జంబప్ప, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.



హొళగుందలో కరపత్రాలను పంచుతున్న నాయకులు

ఆదోని అభివృద్ధికి సహకరించాలి

- మంత్రి లోకేష్‌ను కోరిన శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

వెనుకబడిన ఆదోని అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరామని ఆదోనికి చెందిన పారిశ్రామిక వేత్త, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం అమరావతిలో లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు చెప్పారు. పట్టణంలో రోడ్ల వెడల్పు, జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చూడాలని కోరామన్నారు. ఆరెకల్ వద్ద ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. వేదవతి, ఆర్‌డిఎస్ కాలువల ద్వారా సాగునీరు ప్రవహిస్తే రైతులు వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందుతారని తెలిపామన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలో హాల్వి గ్రామంలో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు... కొల్లి అమ్రేష్ భార్య కొల్లి గంగమ్మ (40) ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని ఆదోని, బళ్లారి వయా మోకా రోడ్డు గుంతలు పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇబ్బందులను గుర్తించిన టిడిపి మండల నాయకులు పాల్ రెడ్డి, బసిరెడ్డి, సర్పంచి మల్లికార్జున సొంత నిధులతో మట్టి వేయించి గుంతలను పూడ్చారు. దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందిగా ఉండడంతో ట్రాక్టర్లతో గ్రావెల్ మట్టిని తెప్పించి పోయించి ట్రాక్టర్ల సహాయంతో చదును చేయించారు. సోమవారం ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో రికార్డ్ అసిస్టెంట్ వీరంగం

- కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులతో వాగ్వాదం - భయాందోళనలో విద్యార్థులు
- పరారీలో రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులు

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసులు (వాసు) మద్యం మత్తులో వీరంగం సృష్టించినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. శ్రీనివాసులు రోజూ మద్యం తాగి కళాశాలకు హాజరవుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు గాదిలింగ, అశోక్ తెలిపారు. సోమవారం వారు ప్రిన్సిపల్ ప్రవీణాకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉదయం 11 గంటల సమయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివే ఆకాష్ జూన్‌లో కళాశాలలో చేరారని, నేటికీ ఆన్‌లైన్ అటెండెన్స్‌లో పేరు కనిపించకపోతే ఆ విషయంపై రికార్డు అసిస్టెంట్‌ను ఆ విద్యార్థి తండ్రి గాదిలింగ వాసును ప్రశ్నించారు. 'అప్లికేషన్ ఎవరికి ఇచ్చారో వాడిని అడగండి. లేదా వాడిని చెప్పుతో కొట్టండి' అంటూ దుర్భాషలాడుతూ కోపోద్రిక్తుడయినట్లు తెలిపారు. అలాగే ఎంపిసి మొదటి సంవత్సరం చదివే అనూష తండ్రి అశోక్.. తల్లికి వందనం డబ్బులు తమ బ్యాంకు అకౌంట్‌లో జమ కాలేదని, కళాశాలలో ఏమైనా సమస్య ఉందేమోనని తెలుసుకునేందుకు కళాశాలకు వస్తే మద్యం మత్తులో ఇష్టమొచ్చినట్లు తిట్టారని వాపోయారు. కళాశాలలోనే ఆయనతో వాగ్వాదానికి దిగారు. శ్రీనివాసులును విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు కళాశాల వద్దకు వెళ్లగా.. రికార్డు అసిస్టెంట్ అప్పటికే పరారీ అయినట్లు వారు తెలిపారు.

రికార్డు అసిస్టెంట్ వాసు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం : ప్రిన్సిపల్ ప్రవీణా

రికార్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు మద్యం తాగి కళాశాలకు వస్తున్న విషయంపై ప్రిన్సిపల్ ప్రవీణాను వివరణ కోరగా... కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా రాసించారని, గతంలో సైతం ఆయన మద్యం సేవించి కళాశాలకు వస్తుండడంతో పలు మార్లు హెచ్చరించినట్లు తెలిపారు. మద్యం తాగి వచ్చిన శ్రీనివాసులుపై జిల్లా అధికారులకు నివేదిక అందిస్తానని చెప్పారు.

హాస్టల్ వసతి కల్పించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆదోని

బీసీ సంక్షేమ హాస్టల్‌లో వసతి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికీ ప్రవేశం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీసీ అసిస్టెంట్ వెల్ఫేర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి ఇన్‌ఛార్జీ అధికారి శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు శశిధర్ మాట్లాడారు. బీసీ హాస్టల్‌లో సీట్లు లేకపోవడంతో విద్యార్థులు విద్యను మధ్యలోనే ఆపేసిన పరిస్థితి ఉందన్నారు. ఆదోని వెనుకబడిన ప్రాంతమని, పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి హాస్టల్ సీట్ ఇవ్వాలని కోరారు. బీసీ హాస్టల్‌లో ప్రతినెలా వైద్య శిబిరం నిర్వహించాలని, హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్, ఉత్తేజ్, చిరు, ఉమాకాంత్, రాజు, మహేష్, హేమంత్ పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'జిల్లా ప్లీనరీని జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈ నెల 26, 27వ తేదీల్లో ఎమ్మిగనూరులో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాము, విజయ్ కుమార్ కోరారు. మంగళవారం ఎమ్మిగనూరులోని ప్రభుత్వ బాలుర (బీసీ) హాస్టల్‌లో ప్లీనరీ సమావేశాల కరపత్రాలను హాస్టల్ విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శాస్త్రీయమైన విద్యావిధానం కోసం ఎస్ఎఫ్ఐ పాటుపడుతోందని, ప్రస్తుత ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల నేపథ్యంలో విద్య పేదలకు అందని ద్రాక్షగా మారిందని తెలిపారు. విద్య కూడా వ్యాపార సరుకుగా మారిపోయిందని, మార్కెట్ మాయజాలంలో ఇరుక్కుపోయిందని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ వాటిని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యమైందని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటంలో విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు ఎమ్మిగనూరులో జరిగే ఈ ప్లీనరీ సమావేశాలను విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజిలెన్స్ దాడులతో..

శ్రీమఠం వ్యవహారాల ప్రక్షాళన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో విజిలెన్స్ దాడులతో వ్యవహారాలు ప్రక్షాళన దిశగా అడుగులు పడుతున్నాయి. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆదేశాల మేరకు శ్రీమఠంలో విజిలెన్స్ వింగ్ ఏర్పాటు చేశారు. విజిలెన్స్ అధికారులుగా శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, సిబ్బంది జె.ప్రహ్లాద, శ్రీనిధి, రిత్తి రామచంద్రా చార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ సురేష్‌తో కలిపి ఐదుగురితో విజిలెన్స్ శాఖ ఏర్పాటు చేసిన నేపథ్యంలో భక్తుల నుంచి దోపిడీని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులను నుంచి కొందరు దళారులే కాక శ్రీమఠంలోని కొంతమంది సిబ్బంది వ్యక్తిగత పరిచయాలు పెంచుకొని వసతి, విఐపి దర్శనం పేరుతో ప్రత్యేక ప్యాకేజీతో రూ.వేలకు వేలు భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ బృందం నిఘా ఉంచింది. ఇటీవల రాఘవేంద్ర సర్కిల్‌లో సెంట్రల్ రిసెప్షన్ ఆఫీసు (సిఆర్ఒ)లో రాత్రి వేళల్లో తనిఖీ చేశారు. కౌంటర్‌లో రూ.15 వేలు తేడా వచ్చింది. వివరాలు ఆరా తీయగా హేమంత్ అనే రిసెప్షనిస్ట్ రూ.6 వేలు వాడుకోగా రికవరీ చేసి సస్పెండ్ చేసినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. సిఆర్ఒ కార్యాలయాల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇక భక్తులు పవిత్రంగా భావించే పరిమళ ప్రసాదం విక్రయంలో కూడా సిబ్బంది అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారనే ఆరోపణలపై నిఘా ఉంచారు. విజిలెన్స్ అధికారుల నేతృత్వంలో ప్రతి ఒక్కరికీ అందాలనే ఆలోచనతో ఒక్కొక్కరికి కేవలం రెండు ప్యాకెట్లు అందజేస్తున్నారు. ప్రతి గురు, శని, ఆదివారాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున అందరికీ కావాల్సినన్నీ పరిమళ ప్రసాదం తయారు చేయించలేక పోవడం వల్ల ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని అధికారులు తెలిపారు. వసతి గృహాలు పూర్తిగా నిండిపోతుండడంతో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తమ ఆధీనంలో ఉన్న టిటిడి కల్యాణ మండపం, పరిమళ పాఠశాలలో భక్తులు ఉచితంగా బస చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

అనారోగ్యంతో మాజీ ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి - దేవనకొండ

నివాళులర్పిస్తున్న కోట్ల సుజాతమ్మ

దేవనకొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి, భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షులు పి.జబ్బార్ సాబ్ (72) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల నాయకులు ఈదుల దేవరబండ సుభాన్, బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్, మలకన్న, రామారావు నాయుడు, రాజయ్య, రాజా సాబ్‌లు జబ్బార్ మృతికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఎంఇఒ-2 కబీర్ సాబ్‌కు సన్మానం

ప్రజాశక్తి - హొళగుంద

ఎంఇఒ-2 కబీర్ సాబ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హొళగుంద జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.కబీర్ సాబ్ ఎంఇఒ-2 అదనపు బాధ్యతలు తీసుకున్న సందర్భంగా యుటిఎఫ్ నాయకులు సన్మానించారు. సోమవారం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేష్, మండల అధ్యక్షులు శేషాద్రి, హాలహర్వి మండల అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శులు పుల్లయ్య, ఎర్రిస్వామి ఎంఇఒ కార్యాలయంలో సన్మానించారు. వెంకటేష్ మాట్లాడుతూ... పాఠశాలలు తెరిచి నెల దాటినా కన్నడ, ఉర్దూ మీడియం పిల్లలకు ఇంగ్లీష్ సబ్జెక్ట్ పాఠ్యపుస్తకాలు అందలేదని తెలిపారు. కన్నడ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, డీఎస్సీ వచ్చేంతవరకు ప్రభుత్వం అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

నాణ్యమైన విద్యనందించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - కౌతాళం

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ శోభారాణి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఎంఇఒ-2 శోభారాణి ఆదేశించారు. సోమవారం మండలంలోని బాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాల, దొమ్మలదిన్నె మండల పరిషత్ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. పాఠశాలల్లోని రికార్డులను, భోజన పథకం పరిశీలించారు. విద్యార్థులకు కొత్త కొత్త అంశాలను, వారికి అర్థమయ్యేలా విద్యను బోధించాలని తెలిపారు.

కెజిబివిలో సీట్లు భర్తీ : ప్రిన్సిపల్ శైలజ

ప్రజాశక్తి - నందవరం

నందవరం కెజిబివిలో 6 నుంచి 10వ తరగతి వరకు సీట్లు భర్తీ అయ్యాయని ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడారు. 6వ తరగతి ప్రవేశం కోసం ప్రభుత్వం కేటాయించిన సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీలు భర్తీ అయినట్లు తెలిపారు. స్కూల్‌లో విద్యార్థులను చేర్పించుకోవాలని ఎవరూ ఒత్తిడి చేసే ప్రయత్నం చేయరాదన్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపిసి గ్రూపులో 16 సీట్లు ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. చేరాలనుకునే విద్యార్థులు పాఠశాలను సందర్శించి సమాచారం తెలుసుకోవాలని తెలిపారు.